నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ గురువారం 11 జూలై 2024 | ADILABAD NIRMAL


## కేంద్రంపై కార్మికుల కన్నెర్ర

**కార్మిక చట్టాలను రద్దు చేయాలని కలెక్టరేట్ ఎదుట ఆందోళన**

ఎదులాపురం, జూలై 10 : కేంద్రంలోని బీజేపీ సర్కారు తీసుకొచ్చిన కార్మిక చట్టాలను రద్దు చేయాలని బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట కార్మికులు ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ.. బీజేపీ విధానాలను నిరసిస్తూ కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేస్తున్నామన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీజేపీ బాటలోనే పయనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బండి దత్తాత్రి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి, లింగాల చిన్నన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.నవీన్‌కుమార్, సభ్యులు సునీత, సుభద్ర, కళావతి, పంచశీల, లక్ష్మి, శోభ జాత పాల్గొన్నారు.




ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు




మరమ్మతు పనుల కోసం హరిత రిసార్టును తాత్కాలికంగా మూసివేసినట్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

# టూరిస్ట్ హబ్‌గా కడెం

**● ప్రైవేటు చేతికి హరిత రిసార్ట్ ● మారనున్న పర్యాటక రంగ రూపురేఖలు**

నిర్మల్, జూలై 10(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాను టూరిజం హబ్‌గా మార్చేందుకు అడుగులు పడుతున్నాయి. అరకొర సౌకర్యాల మధ్య కడెంలో కొనసాగుతున్న హరిత రిసార్టును ప్రైవేటు కంపెనీకి అప్పగిస్తు ఇటీవల టూరిజం శాఖ ఎండీ ఉత్తర్వులు జారీ చేసింది. రిసార్ట్స్ నిర్వహణలో అనుభవమున్న బృందావన్ గార్డెన్స్ లేక్‌వ్యూ రిసార్ట్‌కు హరిత రిసార్ట్ నిర్వహణ బాధ్యతలను 33 ఏండ్ల పాటు అప్పగించింది. దీనికి సంబంధించి టెండర్ ప్రక్రియతోపాటు అగ్రిమెంట్ కూడా పూర్తయింది. ఇందులో భాగంగానే బృందావన్ యాజమాన్యం రిసార్ట్‌ను స్వాధీనం చేసుకుని ఆధునీకరణ పనులను మొదలు పెట్టింది. పర్యాటకులకు మంచి భోజన సౌకర్యం కల్పించేందుకు రెస్టారెంట్, పిల్లల కోసం ప్లేగ్రౌండ్, వాటర్ స్పోర్ట్స్, బోటింగ్, ట్రెక్కింగ్, సఫారీ, ప్రాజెక్టులో ఫిషింగ్ వంటి సదుపాయాలను కల్పించనున్నారు. అయితే.. బృందావన్ సంస్థ రిసార్ట్ నిర్వహణతో వచ్చే ఆదాయంతో సంబంధం లేకుండా యేటా అన్ని రకాల పన్నులతో కలుపుకుని రూ.25 లక్షల వరకు టూరిజం శాఖకు చెల్లించాలి. ఈ అద్దెను యేటా నిర్దేశించిన పర్సంటేజీ ప్రకారం పెంచి ఇవ్వాలి

### మారనున్న రూపురేఖలు

రాష్ట్ర నలుమూలల నుంచి కడెం అందాలను తిలకించేందుకు యేటా వేలాది మంది సందర్శకులు వస్తుంటారు. వీరికి కనీస సౌకర్యాలు, భోజన వసతి లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రారంభంలో కొంత నిర్వహణ బాగానే ఉన్నప్పటికీ, అనంతరం టూరిజం శాఖ రిసార్ట్‌ను గాలికొదిలేసిందన్న ఆరోపణలు ఉన్నాయి. టీవీలు, ఏసీ సదుపాయం లేకపోవడం, పరిసరాలు కూడా పూర్తి అపరిశుభ్రంగా మారడంతో సందర్శకుల సంఖ్య తగ్గుతూ వస్తున్నది. ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రాధాన్యమిస్తున్న క్రమంలో రూపురేఖలు మారనున్నాయి. ప్రాజెక్టు వద్ద అటవీ శాఖ పరిధిలోని వ్యూ పాయింట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టనున్నట్లు



Telangana Tourism Development Corporation Ltd.
# 3-5-891, Himayatnagar, Hyderabad
Memo No. TSTDC/MD Peshi/AMC
Sub: - TSTDC - handing over the Kadem ... Brundavan Gardens and Lake View Resorts Pvt. Ltd
The property Haritha Hotel at Kadem ... Ravinder Rao garu by handing over our property ... immediate effect as per the schedule of the agreement ... Sy. No. 33 & 35, Peddur Village and Mandal ... by name M/s Brundavan Gardens and Lake View ... allowed to take over the premises and payment ... without fail.
(K. Ramesh Naidu, IFS)
Managing Director
To,
Sri Nathanu, GM (Hotels), CO, Hyd.
Ramesh Nayak. N, AGM (AMC), CO, Hyd.
Cc to:
M/s Brundavan Gardens and Lakeview Resorts Pvt. Ltd.
H. No 18-117, Vidyanagar,
Khanapur, Adilabad Dist.

బృందావన్ రిసార్టుకు లీజుకిచ్చినట్లు టూరిజం శాఖ ఎండీ జారీ చేసిన లెటర్

తెలిసింది. దీంతో నిర్మల్ జిల్లాలోని కడెం మరో ఎకో టూరిజం స్పాట్‌గా మారనున్నది.

### ప్రభుత్వ ఆదేశాలతోనే..

**- పీ.రవీందర్‌రావు, బృందావన్ గార్డెన్ లేక్‌వ్యూ రిసార్ట్ సంస్థ చైర్మన్.**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతోనే జూన్ 22వ తేదీన టూరిజం శాఖ ఎండీ కడెం హరిత రిసార్టును తమ సంస్థకు 33 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చినట్లు బృందావన్ గార్డెన్స్ లేక్‌వ్యూ రిసార్ట్ సంస్థ చైర్మన్ పీ.రవీందర్‌రావు తెలిపారు. పదకొండేండ్ల క్రితమే ఇక్కడ రిసార్ట్‌ను నిర్మించేందుకు తమ సంస్థ టెండరు దక్కించుకున్నదని, కొన్ని సాంకేతిక కారణాలతో వాయిదా పడుతూ వచ్చిందన్నారు. జలయజ్ఞంలో భాగంగా 2013లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని ఏడు ప్రాజెక్టుల వద్ద పీపీపీ (ప్రైవేటు పబ్లిక్ పార్టర్నర్‌షిప్) పద్ధతిలో పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో నాటి ప్రభుత్వం టెండర్లను పిలిచిందని తెలిపారు. ఈ టెండర్‌ను తమ సంస్థ దక్కించుకుని డిసెంబర్ 27, 2013న టూరిజం శాఖతో ఒప్పందం కుదుర్చుకున్నదని వివరించారు. అప్పట్లో టూరిజం శాఖ అధికారుల మధ్య సమన్వయం లేని కారణంగా నాటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి వచ్చిన నిధులను కడెంకు మళ్లించి ఇక్కడ టూరిజం శాఖ హరిత రిసార్ట్ కట్టడానికి టెండర్లను పిలిచిందన్నారు. దీనికి తాము అభ్యంతరం తెలుపగా.. హరిత రిసార్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరయ్యాయని, రిసార్ట్‌ను తామే నిర్మించి ఇస్తామని తమ సంస్థను అప్పటి పర్యాటక శాఖ ఎండీ కోరగా, ఇందుకు తాము అంగీకారం తెలిపామన్నారు. నిర్మాణానికి అయిన ఖర్చుకు గతంలో కుదుర్చుకున్న అగ్రిమెంటుపై 5 శాతం అదనంగా చెల్లించేందుకు ఒప్పుకున్నామని తెలిపారు. ఆ తర్వాత క్రమంలో ప్రభుత్వాలు, అధికారులు మారిన కారణంగా సకాలంలో రిసార్టు అప్పగించకపోవడంతో 2015లో కోర్టుకు వెళ్లగా జూన్ 30, 2015న బృందావన్ సంస్థకు అనుకూలంగా తీర్పునిచ్చిందని తెలిపారు. ఈ తీర్పును అధికారులు బేఖాతరు చేయడంతో అధికారులపై కోర్టు ధిక్కరణ కింద కేసు వేశామన్నారు. ఈ క్రమంలోనే 2021లో టూరిజం శాఖ కార్యదర్శికి వినతి పత్రం అందజేయగా సెప్టెంబర్ 18, 2021న టూరిజం బోర్డులో నిర్ణయం తీసుకుని కడెం హరిత రిసార్ట్‌ను బృందావన్ సంస్థకు అప్పగించాలని ఆదేశాలిచ్చిందన్నారు. బోర్డు నిర్ణయం మేరకు ప్రభుత్వంలో మళ్లీ పునఃపరిశీలన జరిపిన అనంతరం అక్టోబర్ 6, 2023లో మా సంస్థకు అప్పగించాలని ఆదేశించింది. ఆ తర్వాత సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడం, అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల కోడ్ కారణంగా అప్పగింత వాయిదా పడుతూ వచ్చిందని తెలిపారు. టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థపై మేము పెట్టిన కోర్టు కేసులను ఉపసంహరించుకునే షరతుపై జూన్ 22, 2024న హరిత రిసార్ట్‌ను తమకు అప్పగించాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈ మేరకు జూన్ 24, 2024న రిసార్టును స్వాధీనం చేసుకుని సంస్థపై పెట్టిన కేసులను ఉపసంహరించుకున్నామన్నారు. త్వరలోనే ఇక్కడి రిసార్టును అన్ని హంగులతో తీర్చిదిద్ది పర్యాటకులకు అందుబాటులోకి తెస్తామని బృందావన్ గార్డెన్స్ లేక్‌వ్యూ రిసార్ట్ సంస్థ చైర్మన్ పీ.రవీందర్‌రావు వెల్లడించారు.

# వేతనాలు ఇయ్యలే..

**పదవీకాలం ముగిసినా అందని గౌరవ వేతనం**

**● కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రావడం లేదు.. ● ఆరు నెలలుగా ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీల అవస్థలు**

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్, జూలై 10(నమస్తే తెలంగాణ) : పదవీకాలం ముగిసినా ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనం అందడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీలు గౌరవ వేతనం అందుకోకుండానే పదవీకాలం ముగిసిపోయింది. గత ప్రభుత్వాల హయాంలో ప్రజాప్రతినిధులకు నామమాత్రపు వేతనాలు అందేవి. కేసీఆర్ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రజాప్రతినిధులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని భావించారు. ఎంపీటీసీలకు నెలకు రూ.750 ఉన్న గౌరవ వేతనాన్ని రూ.5వేలు, ఎంపీపీలకు రూ.1500ల నుంచి రూ.10వేలు, జడ్పీటీసీలకు రూ.2,250ల నుంచి రూ.10 వేలకు పెంచారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ పెరిగిన నేపథ్యంలో మరోసారి వారి వేతనాలను 30 శాతం పెంచాలని కేసీఆర్ సంకల్పించి పెంచారు. దీంతో రూ.5 వేలు ఉన్న ఎంపీటీసీల గౌరవ వేతనం రూ.6500లకు, జడ్పీటీసీ, ఎంపీపీలకు రూ.5 వేలు ఉన్న గౌరవ వేతనాన్ని రూ.13 వేలకు కేసీఆర్ ప్రభుత్వం పెంచింది. అప్పటి వరకు రూ.7,500 గౌరవ వేతనం అందుకునే జడ్పీ చైర్మన్లకు కూడా రూ.ఒక లక్షకు పెంచి అందరూ ప్రజా ప్రతినిధులను గౌరవం కల్పించి వారికి వేతనాలను సకాలంలో అందించేవారు. సమైఖ్య పాలనలో నామమాత్రపు జీతానికి పరిమితమైన ప్రజాప్రతినిధులు కేసీఆర్ పాలనలో గౌరవ వేతనం ప్రకటించి వారి కష్టానికి తగినట్లు వేతనాలు అందిచడంపై ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వేతనాలు రావడం లేదు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాప్రతినిధులకు వేతనాలు రావడం లేదు. కాగా, గౌరవ వేతనం పొందకుండానే తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్లు పదవీ నుంచి దిగిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు జరిగినప్పటి నుంచి ఒక్క రూపాయి కూడా గౌరవ వేతనం అందకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీలు గుర్రుగా ఉన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తమకు గౌరవ వేతనం అందించి తగిన గుర్తింపును అందించిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ గౌరవ వేతనాలను నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగియగా ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు తమకు వస్తాయా? రావా? అనే సందిగ్ధంలో ఉన్నారు.

### వినతిపత్రం అందించినా..

ఇటీవల ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ఎంపీపీ, జడ్పీటీసీలు వినతిపత్రం అందించారు. తమకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇప్పించాలని వేడుకున్నారు. అయినప్పటికీ గౌరవ వేతనం అందకపోవడంపై మాజీలు కాంగ్రెస్ సర్కారు పాలనపై అసంతృప్తితో ఉన్నారు.

### ఉమ్మడి జిల్లాలో 59 మంది జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు అందని వేతనం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నలుగురు జడ్పీ చైర్మన్‌లతోపాటు 59 మంది జడ్పీటీసీలు, 64 మంది ఎంపీపీలు, 507 మంది ఎంపీటీసీలకు గౌరవ వేతనం అందలేదు. కేసీఆర్ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా వేతనాలు పొందిన జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆరు నెలలుగా గౌరవ వేతనాలు పొందలేదు. జూలై 4వ తేదీతో పదవీకాలం ముగిసి వీరంతా మాజీ ప్రజా ప్రతినిధులు అయినా కాంగ్రెస్ సర్కారు మాత్రం కనికరం చూపకపోవడంపై విమర్శలు వెలువడుతున్నాయి.



తమకు వేతనాలు ఇప్పించాలని ఉట్నూర్‌లో ఇటీవల మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీలు

### పదవీకాలం ముగిసినా గౌరవ వేతనం అందలేదు..



కుభీర్, జూలై 10 : కాంగ్రెస్ పాలన అంతా అస్తవ్యస్తంగా మారింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎంపీటీసీల గౌరవ వేతనం చెల్లించేందుకు ముందుకు రాకపోవడం విడ్డూరం. కేసీఆర్ ప్రజామోద పాలనలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులందరికీ గౌరవం లభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు నెలల పాలన ఏడుపు తెప్పిస్తోంది. పదవీ కాలం ముగిసినా గౌరవ వేతనం చెల్లించలేని దుస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొట్టుమిట్టాడుతున్నది. ఇక పనులు చేసిన వాటికి ఇంతవరకు బిల్లులు కూడా అందడం లేదు. ఇలాంటి ప్రభుత్వం తామెన్నడూ చూడలేదు.

**- షేక్ మొహియొద్దీన్, మాజీ ఎంపీటీసీ, కుభీర్.**

### ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా..



కుభీర్, జూలై 10 : ఆరు నెలలు గడిచినా తమకిచ్చే గౌరవ వేతనం ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సారం చేస్తున్నది. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏనాడూ జీతాలు ఆపలేదు. జీపీలకు నిధులు లేవు. సర్పంచ్‌ల ఎన్నికలు నిర్వహించే సాహసం చేయడం లేదు. పరిపాలన స్తంభించింది. పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. గ్రామాలు కంపు కొడుతున్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. వెంటనే ఎంపీటీసీల గౌరవ వేతనం విడుదల చేయాలి. లేని పక్షంలో ఆందోళనలకు వెనుకాడేది లేదు.

**- దొంతుల దేవీదాస్, మాజీ ఎంపీటీసీ, నిగ్వ.**

### ఆరు నెలల వేతనం రావాలి..



సోన్, జూలై 10 : గత సర్కారు ఎంపీటీసీకు గౌరవ వేతనం కింద నెలకు రూ.6,500 అందిస్తామని చెప్పడంతో కొత్తగా ఎన్నికైన తమకు సంతోషం అనిపించింది. అయితే గత ఐదేళ్లలో నెలనెల వేతనం ఇవ్వకున్నా.. ఒకేసారి రెండు, మూడు నెలలవి ఖాతాల్లో జమ చేస్తుండే. గత ఆరు నెలల నుంచి ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం ఇప్పటివరకు ఖాతాల్లో వేయడం లేదు. మా పదవి కూడా అయిపోయింది. వెంటనే ఆ డబ్బులను వెంటనే మా ఖాతాల్లో జమ చేయాలని కోరుతున్నా.

**- నాగయ్య, మాజీ ఎంపీటీసీ, న్యూ వెల్మల్.**

## మహిళల హామీలు నెరవేర్చాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకురాళ్లు

భైంసా, జూలై 10 : మాయ మాటలతో గద్దెనెక్కిన కాం గ్రెస్ సర్కారు మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీజేపీ మహిళా మోర్చా అసెంబ్లీ కో-కన్వీనర్ సిరం సుష్మారెడ్డి డిమాండ్ చేశారు. మహిళా మోర్చా ఆధ్వర్యం లో బుధవారం మహిళలతో కలిసి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి మాట్లాడారు. ఫ్రీ బస్సు తప్ప మహిళలకు చేసిందేమి లేదన్నారు. మహిళకు నెలకు రూ. 2500 ఇవ్వడంతోపాటు, పింఛన్లు రూ.2వేల నుంచి రూ.4వేలు పెంచాలన్నారు. కల్యాణలక్ష్మీ పథకం కింద లక్ష రూపాయలు, తులం బంగారం ఇవ్వాలన్నారు. కళాశాలకు వెళ్లే బాలికలకు స్కూటీలు, రూ.5 లక్షల విద్యార్థి కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చాలని లేని పక్షంలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు. అనంతరం ఆర్డీవో కోమల్ రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. నిరసనలో బీజేపీ ముథోల్ మహిళా మోర్చా అధ్యక్షురాలు దీపాలి, భైంసా పట్టణ అధ్యక్షురాలు ప్రమీల, నాయకురాలు శారద పాల్గొన్నారు.




నిరసన చేపడుతున్న ఏఐఎస్‌బీ నాయకులు

## ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

భైంసా, జూలై 10 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర అధ్యక్షులు జవారే రాహుల్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం ఆర్డీవో కోమల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇందులో డివిజన్ నాయకులు హైదర్, రమేశ్ ఉన్నారు.

## నిధులు విడుదల చేయాలి..

ఎదులాపురం, జూలై 10 : కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల కోసం రూ.630 కోట్లు కేటాయించింది. కానీ.. నిధులు విడుదల చేయడం లేదు. ఉద్యోగులకు ఇబ్బందులు తప్పడం లేదని తెలంగాణ యూనైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ అన్నారు. ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే పట్టణంలోని యూపీహెచ్‌సీల ఎదుట నిరసన తెలిపారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పుష్పలత, ఆనందబాయి, తులసీ, ప్రశాంత్ దేశ్‌పాండే, కిరణ్, సురేందర్, శ్రీనివాస్, దేవుబాయి, లక్ష్మి, పుష్ప, రమాదేవి, అన్నపూర్ణ, దత్తు, సునీత పాల్గొన్నారు.



యూపీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది

## ముగిసిన మొదటి దశ కౌన్సెలింగ్

బాసర, జూలై 10 : బాసరలోని ఆర్‌జీయూకేటీలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి దశ కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా జాయింట్ కన్వీనర్ పావని మాట్లాడుతూ.. మిగిలిన సీట్లకు రెండో విడుతలో భర్తీ చేస్తామని, దానికి సంబంధించిన జాబితాను త్వరలో విడుదల చేస్తామన్నారు. 369 మంది హాజరు కాగా.. 35 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. మొత్తం 1,404 మంది కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉండగా.. 1,296 మంది హాజరై108 మంది గైర్హాజరయ్యారన్నారు. ఈ కౌన్సెలింగ్‌లో జాయింట్ కన్వీనర్లు రంజిత్‌కుమార్, దత్తు, అడ్మిషన్స్ కమిటీ సభ్యులు హరికృష్ణ, కుమార్, శ్రీకాంత్, రాకేశ్‌రెడ్డి, ఆధ్యాపకులు శంకర్, కమల, మహేశ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు ఎంపిక పత్రాన్ని అందజేస్తున్న అధికారులు


